క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి మండల పూజా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలను అందజేశారు.

రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్ ఆలీఖాన్

రాజుపాళెం : రాజుపాళెం మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా షాకీర్‌ఆలీఖాన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇక్కడ ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న వెంకటరెడ్డి జూన్ 30న పదవీ విరమణ చేశారు. దీంతో ఉన్నతాధికారులు షాకీర్ ఆలీఖాన్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించారు. ఈ సందర్భంగా షాకీర్ ఆలీఖాన్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ముగిసిన భాగవత సప్తాహం


భాగవత సప్తాహం వినిపిస్తున్న భాగవత సమాజం సభ్యులు

ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన భాగవత సప్తాహం మంగళవారం ముగిసింది. శ్రీజగద్గురు ఆదిశంకరాచార్య భాగవత సమాజం ఆధ్వర్యంలో గత నెల 26వ తేదీ నుంచి భాగవత సప్తాహం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అలవలపాటి నారాయణరెడ్డి, ఆర్.జయచంద్రారెడ్డి, యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

భూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు


వివాదాస్పద భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

అట్లూరు : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తహసీల్దారు వేణుగోపాల్ హెచ్చరించారు. మండల పరిధిలోని కామసముద్రం రెవెన్యూ పొలం సర్వే నంబర్ 147లో 46 సెంట్ల వివాదాస్పద భూమిలో ఆర్ఐ కరీముల్లా, వీఆర్ఓ దస్తగిరి, వీఆర్ఏలు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

వేలం పాట వాయిదా

ప్రొద్దుటూరు : తాత్కాలిక దిన కూరగాయల మార్కెట్, వాహనాల పార్కింగ్ రుసుం వసూలుకు బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించాల్సిన బహిరంగ వేలాన్ని వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఎప్పుడు వేలం నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ప్రొద్దుటూరు కల్చరల్: పేద ఆర్యవైశ్య విద్యార్థులు ఈనెల 15 వరకు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్యవైశ్యసభ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఆపై తరగతులలో ఉత్తీర్ణులైన పేద ఆర్యవైశ్య విద్యార్థులకు దరఖాస్తులను ఆర్యవైశ్య సభ కార్యాలయంలో ఇస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీ ప్రవేశాల కోసం ఉచిత హెల్ప్ డెస్క్

మైదుకూరు: డిగ్రీలో చేరే విద్యార్థులకు ఉచితంగా రిజిస్ట్రేషన్, వివిధ రకాలైన కోర్సుల పట్ల అవగాహన కల్పించడానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుండి డిగ్రీ ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. మైదుకూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఉన్న డిగ్రీ చేరబోయే విద్యార్థులకు ఉచితంగా ప్రవేశ రిజిస్ట్రేషన్ చేయడమే కాక వివిధ రకాల కోర్సుల పట్ల సంపూర్ణమైన అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రవేశ రుసుం ఎస్సీ, ఎస్టీ కేటగిరికి రూ.200, బీసీ కేటగిరికి రూ.300, ఓసీ విద్యార్థులు రూ.400 మాత్రమే రిజిస్ట్రేషన్ ఫీజును నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఫీజు ఆన్‌లైన్ ద్వారా కట్టిన తర్వాత ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

చినుకు లేదు.. మొలకా లేదు


కలసపాడులో వర్షాలు లేక బీడుగా ఉన్న భూమి


బోర్ల కింద వరినారు వేసేందుకు పొలాన్ని సిద్ధం చేసిన దృశ్యం

- కరుణించని వరుణుడు
- జూన్‌లో మోస్తరు.. ఇప్పుడు వర్షాభావం
- ఖరీఫ్ సాగు సందిగ్ధం
- దుక్కులు దున్ని ఎదురుచూస్తున్న రైతులు

వరుణుడు కరుణించడంలేదు. ఆకాశంలో మబ్బులు తప్పా చినుకు జాడ లేదు. వర్షాకాలం ఆరంభంలో అందరినీ ఊరించిన వరుణుడు ఇప్పుడు ముఖం చాటేశాడు. అడపాదడపా వర్షాలు కురువడంతో రైతులు వరి విత్తనాలు చల్లారు. కానీ వేసవిని తలపించేలా ఎండలు ప్రభావం చూపుతున్నాయి. పొలాల్లో చల్లిన విత్తనాలు మొలకెత్తక పోగా.. కొన్ని చోట్లు నారు మడులు ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కలసపాడు : వర్షాకాలం వచ్చినా మబ్బులే తప్ప చినుకు జాడ కనిపించడం లేదు. వ్యవసాయానికి అవసరమైన వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలైన తొలసరి పలకరింపు కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. నైరుతి ఆరంభంలోనే వరుణ దేవుడు కరుణించడంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగు పనులు చేపట్టారు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు సరైన వర్షపాతం నమోదు కాలేదు. జూన్ నెల ముగిసినా, కార్తులు వెళ్లిపోతున్నా నేటికీ సరైన వర్షాలు కురవడం లేదు. వర్షాలతో చల్లబడాల్సిన వాతావరణం భానుడి భగభగలతో మండిపోతోంది. ఏప్రిల్, మే నెలల్లో సూర్యప్రతాపంతో అల్లాడిన ప్రజలు జూన్‌లో వర్షాలతో కొంత సేద తీరవచ్చని ఆశించారు. కానీ ప్రజలు, రైతులకు నిరాశే మిగిలింది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అంతేకాకుండా పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు నమోదవుతున్నాయి. రాత్రిపూట కూడా వాతావరణం వేడిగానే ఉంటోంది. జూన్ నెల మొదటి వారంలో వర్షాలు ప్రారంభమై రెండో వారం నాటికి పూర్తిగా చల్లబడాలి. కానీ ఇప్పటికీ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉన్నాడు. వర్షాలు కురుస్తాయని ఆశతో రైతులు పొలాలను సిద్ధం చేసి విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఆందోళనలో అన్నదాత

మండలంలోని బ్రాహ్మణపల్లె, రాజుపాలెం, మహానందిపల్లె, సిద్ధమూర్తిపల్లె, పెండ్లిమర్రి తదితర గ్రామాల్లో సుమారుగా వెయ్యి ఎకరాల్లో రైతులు మినుము పంటను సాగు చేశారు. జూన్ మొదటి, రెండవ వారాల్లో ఓ మోస్తరు వర్షం పడటంతో మినుము పంటను వర్షాధారం కింద సాగు చేశారు. సాగు చేసిన తర్వాత వర్షం లేకపోవడంతో పంట అంతా ఎండుదశకు చేరుకుంది. దీంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.

ఖరీఫ్‌లో వరిసాగు కష్టమే

5 సంవత్సరాల్లో రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో వరి సాగు చేయగా దిగుబడులు బాగా వచ్చాయి. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఇప్పటి వరకు వర్షాలు లేకపోవడంతో అరకొర బోర్ల కింద వరిసాగు చేసేందుకు ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. బోరుబావుల కింద మినహాయిస్తే వర్షాధారం కింద సాగు చేసేందుకు చెరువుల్లో నీరు లేకపోవడంతో ఇప్పటి వరకు వర్షాలు పడకపోవడంతో వరిపంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

వేంకటేశ్వరుడి సేవలో ఎమ్మెల్సీ


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

అట్లూరు : బద్వేలు పట్టణంలోని సిద్దవటం రోడ్డులోని శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ఆవరణలో పద్మావతి, గోదాదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. పద్మావతి, గోదాదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సింగసాని గురుమోహన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, సుందర్‌రామిరెడ్డి, ఎంఆర్ఎఫ్ షోరూమ్ అధినేత గుర్రంపాటి రమణారెడ్డి, ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, అధ్యక్షులు నిమ్మకాయల గురివిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీనివాసుడు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం అనంతరం సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఎమ్మెల్సీ పరామర్శ

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల కొత్తవీధికి చెందిన మాజీ ఎంపీటీసీ, మాజీ కోఆప్షన్ మెంబర్ ఇస్సాక్‌ను మంగళవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పరామర్శించారు. ఇస్సాక్ గుండె ఆపరేషన్ చేయించుకొని సోమవారం ఇంటికి వచ్చారన్న సమాచారం తెలిసి గోవిందరెడ్డి, పార్టీ నాయకులు మాజీ మార్కెటింగ్ చైర్మెన్ కల్లూరు రమణారెడ్డి, కలసపాడు జెడ్పీటీసీ గురివిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి లక్ష్మినారాయణరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు సాయి నారాయణరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరసింహులు, రుద్రవరం రాము, వార్డు మెంబర్ మని, బాష, మస్తాన్ తదితరులతో కలసి ఇస్సాక్‌ను పరామర్శించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి


విద్యాసామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో మంగళవారం పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు 12వ వార్షిక ఉచిత నోటుపుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలను పద్మశాలీయ అభ్యుదయ సంఘం నాయకులు తమ పిల్లలుగా భావించి వారందరికి ఉచితంగా నోటు పుస్తకాలు, విద్యాసామాగ్రి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలను చేయాలని ఆకాంక్షించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బంగారు భవిష్యత్‌కు బాట వేసుకోవాలన్నారు. పద్మశాలి కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, పద్మశాలీయ అభ్యుదయం సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు, అఖిలభారత పద్మశాలీ సంఘం కార్యదర్శి నందం లక్ష్మణ కుమార్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నా సాయికృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తల్లి పేరుతో మొక్కలు నాటండి


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

మైదుకూరు : పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ వారి తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి మోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మైదుకూరు మున్సిపాలిటీలో బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే లింగాలదిన్నె గ్రామంలో బీజేపీ నాయకులు 100 మొక్కలను నాటారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు, రామిశెట్టి రామకృష్ణ, మృదంగం కిశోర్ కుమార్, అజయ్, ఉదయ్ పాల్గొన్నారు.

మంత్రికి వినతి

మైదుకూరు అభివృద్ధిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌కు విజ్ఞప్తి చేసినట్లు బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మంత్రిని ధర్మవరంలో కలిసి మైదుకూరు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాల్సిందిగా కోరినట్లు పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న అర్చకులు, సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం స్వామివారి హుండీని లెక్కించారు. అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి వద్ద గల హుండీలను లెక్కించగా మూడు నెలల 15 రోజులకు గాను రూ.1,50,439లను భక్తులు స్వామివారికి కానుకల రూపంలో సమర్పించారు. అలాగే గోశాలలోని హుండీ లెక్కించగా రూ.20,897 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవాదాయ శాఖ జ్యువెలరి వెరిఫికేషన్ ఆఫీసర్ పాండురంగారెడ్డి, ఏసీ శంకరబాలాజి, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. కాగా మంగళవారం మధ్యాహ్నం జరుగవలసిన ఆలయానికి సంబంధించిన 15 గదుల వేలం వాయిదా వేసినట్లు ఏసీ శంకర బాలాజీ తెలిపారు.

రేపు శివపార్వతుల కల్యాణం

స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం మాస శివరాత్రి పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిలకు విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, సాయంత్రం 6 గంటలకు గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని వివరించారు. అలాగే శుక్రవారం ఆరుద్ర నక్షత్ర అమావాస్య సందర్భంగా ఉదయం 7 గంటలకు మృత్యుంజయ హోమం, సాయంత్రం అగస్త్యేశ్వరునికి భస్మహారతి, భస్మార్చన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని వినతి


తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రజాపక్షం నాయకులు

ప్రొద్దుటూరు : రాయలసీమ వాసుల సాగు, తాగు నీటి కష్టాలు తీరాలంటే సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌బాబుకు మంగళవారం ప్రజాపక్షం నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోయినప్పుడు, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయినప్పుడు రాయలసీమకు జలవనరుల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర జలవనరుల సంఘం 1951లో సిద్ధేశ్వరం అలుగు నిర్మాణానికి అనుమతి మంజూరు చేసిందని గుర్తుచేశారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు నిర్మించి రాయలసీమకు చుక్క నీరు రాకుండా చేశారన్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత పోలవరం జాతీయ ప్రాజెక్టుగా చేశారే తప్ప.. రాయలసీమ ప్రాంతం గురించి పట్టించుకోలేదని విమర్శించారు. సిద్ధేశ్వరం అలుగు నిర్మించి రాయలసీమ జిల్లాల ప్రజల తాగు, సాగు నీరు అందించాలని కోరారు. మల్లికార్జునశెట్టి, గణేష్, బాల్జీ, బాబు, రాజారెడ్డి, రాము పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ స్థాయి లీడర్ల ఒత్తిడితో ఆగిన పింఛన్లు


బాధితులతో కలసి మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి, వినయ్‌కుమార్, రామోహన్‌రెడ్డి

చాపాడు: టీడీపీ నాయకుల ఒత్తిడితో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వృద్ధులు, దివ్యాంగులు, వితంతులతో పాటు ఇతర లబ్ధిదారులకు పింఛన్లను ఆపటం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకులు టీఓపల్లె రవిశంకర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, రామోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మడూరు, అన్నవరం, టీఓపల్లె గ్రామాలకు చెందిన 94 మంది పింఛన్ దారులకు సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛను పెంపు కార్యక్రమంలో నగదు అందించలేదు. దీంతో బాధితులందరూ మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా విలేకరులతో వైఎస్సార్‌సీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛను పెంపు కార్యక్రమంలో పింఛన్లు అందించగా మండలంలోని మడూరు, అన్నవరం, టీఓపల్లె గ్రామాల్లోని 94 మందికి స్థానిక టీడీపీ నాయకులు ఒత్తిడితోనే ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ఫిర్యాదుతో అధికారులు ఆపారన్నారు. పేద ప్రజల పింఛన్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవటం మంచిది కాదన్నారు.

తాగునీటి పథకాన్ని వినియోగించుకోవద్దు

గోపవరం : మండలంలోని రాచాయపేటలో తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకును వినియోగించుకోవద్దని వైద్యాధికారులు స్థానికులకు విజ్ఞప్తి చేశారు. తాగునీటి పథకానికి నిర్వహణ లేకపోవడంతో ఏళ్ల తరబడి శుభ్రం చేయలేదని తెలిపారు. గత నెల 30న రాచాయపేటలో డయేరియా అని సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన వైద్యాధికారులు మహేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి వ్యాధిగ్రస్తులను పరిశీలించారు. డయేరియా, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. తాగునీటి పథకం ద్వారా వచ్చే నీటిని శాంపిల్స్ కోసం ల్యాబ్‌కు పంపగా అవి రంగు మారుతుండటంతో ఎట్టి పరిస్థితుల్లో ఆ నీటిని తాగేందుకు గాని ఇతర అవసరాలకు ఉపయోగించకూడదని నివేదికలో పేర్కొన్నారు.

రేషన్ కార్డుదారుల పట్ల ఇంత నిర్లక్ష్యమా..?


కార్డుదారులతో మాట్లాడుతున్న ఇర్ఫాన్ బాషా

ప్రొద్దుటూరు : రేషన్ కార్డుదారుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని 13వ వార్డు కౌన్సిలర్ సికిలిగిరి ఇర్ఫాన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాసనగర్‌లోని 33వ చౌకదుకాణంలో డీలర్ మొబైల్ వాహనం ద్వారా కాకుండా చౌకదుకాణంలో లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ విషయంపై కౌన్సిలర్‌కు ఫిర్యాదు అందడంతో ఆయన క్యూలో ఉన్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ విషయంపై వీఆర్‌ఓ నాగభూషణంతో కౌన్సిలర్ చర్చించారు. ప్రభుత్వం మొబైల్ వాహనం ద్వారా సరుకులు ఇవ్వమంటే డీలర్ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని కౌన్సిలర్ తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరం


ప్రొద్దుటూరు క్రైం : మాట్లాడుతున్న డాక్టర్ హనీఫ్‌బాబా


అట్లూరు : మాట్లాడుతున్న వైద్యాధికారి వినయ్‌కుమార్

ప్రొద్దుటూరు క్రైం : వ్యక్తిగత శుభ్రతతో అంటువ్యాధులు దూరమవుతాయని డాక్టర్ హనీఫ్‌బాబా అన్నారు. కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు పలు పాఠశాలలను సందర్శించి డయేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోములవారిపల్లెలోని ప్రభుత్వ పాఠశాల, వికాస్ హైస్కూళ్లకు మంగళవారం డాక్టర్ హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది వెళ్లారు. విద్యార్థులకు ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. డయేరియా, డెంగీ వ్యతిరేక మాసోత్సవంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, హెడ్‌మాస్టర్లు మల్లికార్జునరెడ్డి, జయపాల్, సీహెచ్‌ఓ నరసింహ, ఆశా వర్కర్లు మేరీ, పోలమ్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

బి.కోడూరు : పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. మంగళవారం కాసానగరం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్ రాజు, ఎంపీడీఓ భాస్కర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వాటర్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతిరోజు వాటర్ ట్యాంక్ క్లోరినేషన్ చేయాలని ప్రిన్సిపాల్, ఏఎన్ఎంను ఎంపీడీఓ ఆదేశించారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. మంగళవారం బి.కోడూరు ఉన్నత పాఠశాలను సందర్శించారు. సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అట్లూరు : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో సురేంద్రనగర్, కోటవీధి ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్, డయేరియా నివారణ కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, డాక్టర్ శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్, శ్రీరామయ్య, ఖాసీం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ లాగా మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేయాలని యువజన కాంగ్రెస్ ఆర్టీఐ రాష్ట్ర చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కి హోదాపై చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కనీసం నోరు విప్పడం లేదన్నారు. ఎందుకు మౌనం వహిస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ సుశీల్ కుమార్, షేక్ అమీర్ బాషా, బాబు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాయలసీమ జోనల్ సీఎంఈ పీటల్ మెడిసిన్ క్విజ్ పోటీలను ఫాతిమా మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జోన్ నుంచి వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు ఎం.మన్యతారెడ్డి రెండవ బహుమతిని, కె.సుదీప్ వాస్ మూడవ బహుమతిని గెలుచుకున్నారు.

కుందూ తీరంలో జీలుగ సాగు


కుందూతీర పరిధిలో జీలుగ వేసిన రైతులు

రాజుపాళెం : కుందూతీర గ్రామాల్లోని రైతులు వరి సాగు చేసేందుకు జీలుగ పంటను వేశారు. ఇంకో నాలుగైదు రోజుల్లో నారుకయ్యలు సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ముందుగా పచ్చిరొట్టగా జీలుగ విత్తనాలను చల్లడంతో పొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి. కుందూనదిలో నీరు అరకొరగా వస్తున్నాయని, నదిలో నీరు పెరిగితే వరిపంట సాగు చేసినా ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు.


వెల్లాల వద్ద కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు


కుందూనది నీటిని పొలాలకు అందిస్తున్న రైతులు

గోశాలను తనిఖీ చేసిన కమిషనర్

కడప కార్పొరేషన్ : చింతకొమ్మదిన్నె మండలంలోని గోశాలలో పని చేస్తున్న వర్కర్లకు సబ్బులు, కొబ్బరినూనె సరఫరా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన గోశాలను తనిఖీ చేశారు. ఆవు పేడను కుళ్లబెట్టి వానపాములను ఉత్పత్తి చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. గోశాల వద్ద సూపర్ నేపియర్ గ్రాస్ ఏర్పాటు పరిశీలించి, ఖాళీ ప్రదేశాల్లో కూడా అలాంటి గడ్డిని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.